కమనీయం రాములోరి కల్యాణం

● భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి వేడుకలు
● రామనామంతో మార్మోగిన ఆలయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరవాసులు శ్రీరామనవమిని ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శ్రీసీతారాముల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి వేదపండితుల మంత్రోచ్చారణలతో కల్యాణం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు కల్యాణోత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు.

శ్రీకోదండ రామాలయంలో..

ముత్యాలంపాడు శ్రీకోదండ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణలతో కల్యాణం కమనీయంగా సాగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు, కార్యదర్శి డీ శివరామరాజు పర్యవేక్షించారు. అలాగే దేవీనగర్ శ్రీకోదండ రామాలయంలోనూ శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యాన రాములోరి కల్యాణం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కే వీరరాజు, గంగిశెట్టి సాంబశివరావు, భక్తులు పాల్గొన్నారు. శ్రీనగర్ కాలనీలో దేవరపు మాల్యాద్రి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని సీతారాములకు పూజలు చేశారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులకు విసన కర్రలు, వడపప్పు, పానకం పంపిణీ చేశారు. మాచవరం డౌన్ కుటుంబరావు వీధిలో స్థానిక కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, సతీష్ దంపతులు సీతారాముల కల్యాణం నిర్వహించారు. అలాగే మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారి ఆలయంలో ఐఏఎస్ అధికారి ఎం. రవిచంద్ర, పద్మావతి దంపతులు, కే వెంకటేష్, లోకేశ్వరి దంపతులు పీటల మీద కూర్చుని రాముల వారి కల్యాణం చేశారు. జీవీఆర్‌నగర్ దేవుని మండపం వద్ద, దావు బుచ్చయ్యకాలనీ తొమ్మిదో రోడ్డులో, అజిత్‌సింగ్‌నగర్ రామానగర్‌లో శ్రీసీతారామ లక్ష్మణ సమేత దాసాంజనేయ దేవస్థానంలో శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి.

విజయవాడ కల్చరల్: శ్రీకృష్ణదేవరాయ కల్చరల్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో బీఆర్‌టీఎస్ రోడ్డులోని ఆ కమిటీ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. కమిటీ వ్యవస్థాపకుడు శీలం నాగేశ్వరరావు మాట్లాడుతూ రామరాజ్యమే ధ్యేయంగా ప్రభుత్వాలు పనిచేయాలని కోరారు. దేవరాయలు స్ఫూర్తితో దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం, మజ్జిగ పంపిణీ, ఆహార పొట్లాల పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు నవనీతం సాంబశివరావు, కుంచా రమేష్, బొర్రా రామకృష్ణ పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేశారు.

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 64వ డివిజన్ విలేజి కండ్రిక రామాలయంలో ఆదివారం శ్రీరామ నవమి పురస్కరించుకుని సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. వేడుకల్లో వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని రాములోరి కల్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు. జానకి సమేత శ్రీరామచంద్రుని సుగుణాలను కీర్తించారు. భక్తులకు పానకం, వడపప్పును అందించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, దేవిరెడ్డి సంజీరెడ్డి, భీమిరెడ్డి శివరామిరెడ్డి, లఖుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజీవ్‌నగర్‌లోని శ్రీకోదండ రామాలయం, వాంబేకాలనీల్లో జరిగిన సీతారాముల కల్యాణ వేడుకల్లో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, ఆలయ చైర్మన్ కే గురవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, పసులేటి ఏసు, మాతా మహేష్‌లతో కలిసి మల్లాది విష్ణు పాల్గొన్నారు. నున్న సీఐ పీ కృష్ణమోహన్ దంపతులు, కే వెంకటచలమారెడ్డి దంపతులు కల్యాణం నిర్వహించారు.

బాబా మందిరంలో నవమి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఆలయ కమిటీ అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు దంపతులు రాముల వారి కల్యాణం నిర్వహించారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు సీతారాములను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం హిందూ ముస్లిం సమైక్యతను చాటేలా మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ ముత్యాలంపాడు, సత్యనారాయణపురం పురవీధుల మీదుగా చందనోత్సవం జరిగింది. అలాగే మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో సీతారాముల కల్యాణం జరిగింది. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.



నందమూరినగర్‌లో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



శ్రీనగర్‌కాలనీలో ఎమ్మెల్యే బొండా ఉమా



శ్రీ సీతారాముల కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు



శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం




కండ్రికలో అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సీతారాములకు పూజలు చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి



చందనోత్సవం ఊరేగింపు



మాచవరంలో సీతారాముల కల్యాణోత్సవం

శ్రీరామ చరితం ఆదర్శప్రాయం

శ్రీరాముని జీవితం అందరి జీవన గమనానికి తారకమంత్రం అని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. నందమూరినగర్, బుడమేరు వంతెన వద్ద జరిగిన శ్రీరామనవమి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ శ్రీరామ చరితం అన్ని విధాలా ఆదర్శప్రాయమని అన్నారు. మనిషి ఎలా జీవించాలి, సమాజంలో తన ధర్మాలను ఎలా నిర్వర్తించాలన్నది రామాయణం చెబుతుందన్నారు. తండ్రి మాటని జవదాటని రామయ్య జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా నవమి వేడుకలు



లబ్బీపేట శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం

విజయవాడ కల్చరల్: కంచి కామకోటి పీఠ శారదా చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని లబ్బీపేట శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక స్వాములు సీతారామచంద్ర ప్రభువుకు ప్రత్యేక పూజలు చేశారు. పిళ్లా మోహనరావు దంపతులుచే అర్చక స్వాములు కల్యాణ క్రతువు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు డాక్టర్ సీ రామ్మోనరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. అలాగే దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో భక్తుల సమక్షంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75 వర్ధంతి సందర్భంగా దేవాలయంలో నవ చండీహోమం, రుద్ర పారాయణం, వేద స్వస్తి కార్యక్రమం నిర్వహించారు. ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ శ్రీకోదండ రామాలయంలో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన జంగం విజయ్‌కుమార్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. భక్తి కీర్తనలకు అనుగుణంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆద్యంతం మంత్రముగ్దులను చేశాయి. చిన్నారుల ప్రదర్శనలు ఆహుతులను భక్తి తన్మయత్వంలో ముంచెత్తాయి. పెద్ద సంఖ్యలో భక్తులు సీతారాములను దర్శించుకుని కూచిపూడి నృత్య ప్రదర్శనలను తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన కళాకారులను సత్కరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు కే వీరరాజు, కార్యదర్శి గంగిశెట్టి సాంబశివరావు, పీ నాగమధుసూదనరావు, కే సాంబశివరావు, సీహెచ్ వెంకటసుబ్బారెడ్డి, డీ రామారావు, కే వెంకట దుర్గా రమేష్‌నాయుడు తదితరులు పర్యవేక్షించారు.

నేడు వీఎంసీలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేందుకు విజయవాడ నగర పాలక సంస్థ నిర్వహిస్తున్న ప్రజా సమస్యలు - పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం, చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయం, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. విజయవాడ నగర వాసులకు వీఎంసీ అందించే మౌలిక వసతుల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు.

రేపు సిద్ధార్థలో ఈకాన్ - 2కే25



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తమ కళాశాల స్టూడెంట్స్ ఆఫ్ ఎకనామిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఈకాన్ - 2కే25 పేరుతో సిద్ధార్థ ఆడిటోరియంలో ఎకనామిక్స్ చదువుతున్న విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించనున్నట్లు సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ తెలిపారు. కళాశాల ఆవరణలోని ప్రిన్సిపాల్ చాంబర్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. డిగ్రీ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు 2015 సంవత్సరం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ మధుబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. స్టార్టప్ ఐడియా (అంకురాలోచన), వక్తృత్వం, క్విజ్, పోస్టర్ రూపకల్పన వంటి పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈకాన్ - 2కే25 కార్యక్రమ కన్వీనర్ సీహెచ్‌వీ రోహిణి కుసుమతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి అమ్మవారిగా కాళీమాత



కృష్ణలంక(విజయవాడ తూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారు ఆదివారం భక్తులకు విజయలక్ష్మి అమ్మవారిగా దర్శనమిచ్చారు. విశ్వావసు నామ సంవత్సర వసంత నవరాత్రుల్లో భాగంగా చివరి రోజు మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతీ అమ్మవార్లకు ఐదు వేల సంపంగి పూలతో నేత్రపూర్వకంగా పుష్పార్చన నిర్వహించారు. వేదపండితుడు మార్తి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, సహస్రనామ అర్చన, విశేష పూజలు జరిపారు. ఆధ్యాత్మిక సలహాదారుడు విజయ కిరణ్ శర్మ దంపతులు అమ్మవారికి పట్టుచీరను బహూకరించారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జీ పుల్లయ్య, కే జగదీష్, ఆధ్యాత్మిక సలహాదారుడు విజయకిరణ్‌శర్మ, మల్లేశ్వరరావు దంపతులు, జీ సత్యం దంపతులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో చందనోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీరామనవమి సందర్భంగా భవానీపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని సంకల్పసిద్ధి శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం చందనోత్సవం వైభవంగా జరిగింది. సాయిబాబా చిత్రపటాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గం అధ్యక్షుడు బూరె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మోటుమర్రి సుబ్బారావు, కార్యదర్శి చందలూరి రాజశేఖర్, పీవీఎల్ ప్రసాద్, గుడివాడ విజయ్‌కుమార్, యెనిగళ్ల సుబ్బారావు, పీ రజనీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

సమాజానికి జ్ఞానదీపం గురువు



నాట్యకళాకారులకు యువ నాట్యగురు పురస్కారాలను అందజేసిన నిర్వాహకులు

విజయవాడకల్చరల్: అటు సమాజంలోనూ ఇటు వ్యక్తుల్లోనూ జ్ఞానదీపం వెలిగించేవాడు గురువు అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సాయిరాం మహారాజ్ అన్నారు. శ్రీ వాగ్దేవీ కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, నాట్యానికి సేవలను అందించిన నాట్య గురువులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. సాయిరాం మహారాజు మాట్లాడుతూ గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాలని సూచించారు. వందే జగద్గురుం మన విశ్వాసమని వివరించారు. నాట్యాచార్యుడు సప్పా శివకుమార్ మాట్లాడుతూ నాట్య గురువులు సంప్రదాయ నృత్యాన్ని పరిరక్షించడానికి కృషి చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. విద్యావేత్త బాదినేని రాము మాట్లాడుతూ బాల బాలికల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. నాట్యాచార్యులు రోహితం లక్ష్మీవాత్సల్య, నట్టు వేణుగోపాల్, జొన్నాదుల బేబీ వెన్నెల, అవ్వారు శ్రీదేవి, చెన్నా తన్మయి, దామర్ల నాగచందన, పట్టెం మేఘన, దాము చరిష్మాదేవికి యువనాట్య గురు పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని నాట్యాచార్య మాగలూరి త్రినాథాచారి, సప్పా ధనలక్ష్మి నిర్వహించారు. చిన్నారులు 150 మంది ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన కుమార్తె ఇంటికి తిరిగి రాలేదని తల్లి ఫిర్యాదు చేయడంతో నున్న పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాష్‌నగర్‌కు చెందిన తానేటి చంద్రమ్మ ఇంట్లో పాచి పనులు చేస్తుంది. ఆమె భర్త 18 సంవత్సరాల క్రితం మృతిచెందాడు. ఆమెకు 17 సంవత్సరాల కుమార్తె ఉంది. ఈ నెల మూడవ తేదీన కూరగాయాలు తీసుకురావడానికి అని బయటకు వెళ్లిన యువతి ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద విచారించిన యువతి ఆచూకీ తెలియలేదు. ఫోను చేస్తే రింగ్ అవుతుంది కానీ లిఫ్ట్ చేయడం లేదు. యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్లు ఇలా.. రాకపోకలు ఎలా..?

● సహనాన్ని పరీక్షిస్తున్న పైపులైన్ పనులు
● రోడ్లు తవ్వి వదిలేస్తున్న వైనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీలో అధికారుల నిర్లక్ష్యం వల్ల రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది. జీవీఆర్‌నగర్‌లో యూజీడీ పైపులైన్ పనులు, దావు బుచ్చయ్యకాలనీలో వాటర్ పైపులైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే దేవీనగర్ ఎనిమిదో రోడ్డు ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్‌లో రోడ్డును తవ్వి యూజీడీ పనులు చేపట్టారు. వారం రోజులు కావస్తున్నా తవ్విన గోతులను సరి చేయలేదు. దీంతో ఇక్కడ ఆర్టీసీ బస్సులు మలుపు తిరిగేందుకు, వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు.

నత్తనడకన పైపులైన్ పనులు

స్థానిక 31వ డివిజన్ శ్రీనగర్ కాలనీ యూజీడీ పంపింగ్ స్టేషన్ నుంచి అంబేడ్కర్ కాలనీ వరకు యూజీడీ పైపులైన్ పనులు కూడా నత్తనడకన సాగుతూ వాహనచోదకుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. అలాగే దావు బుచ్చయ్యకాలనీలో ఇటీవల వాటర్ పైపులైన్ పనుల్లో భాగంగా రోడ్డును తవ్వి పనులు పూర్తిచేశారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ తవ్విన రోడ్డుపై కేవలం మట్టిని మాత్రమే పోసి రోడ్డును సరిచేయకుండా చేతులు దులుపుకొన్నారు. రోడ్డును సరిచేయాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు వర్షాలు కురుస్తుండటంతో రోడ్డు బురదగా మారి చిన్నారులు, మహిళలు, వాహనచోదకులు జారి పడుతున్నారు. అంతేకాకుండా ఇక్కడ రోడ్డు మధ్యలో కంకర వేసి వదలివేశారు. అసలే ఒక పక్క రోడ్డును తవ్వి రాకపోకలకు వీలులేకుండా చేశారు. ఇప్పుడు రోడ్డు మధ్యలో కంకర వేయడంతో స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. అసలే తాగునీరు లేక ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు ఇంటికి వెళ్లేందుకు మార్గం కూడా లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దేవీనగర్ ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్‌లో తవ్విన రోడ్డు



దావు బుచ్చయ్యకాలనీలో రోడ్డును తవ్వి సరిచేయకుండా వదిలేసిన దృశ్యం



రోడ్డు మధ్యలో కంకర

• కమనీయం.. కల్యాణం



పాత హౌసింగ్ బోర్డు కాలనీలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ఏలూరు రోడ్డులోని రామాయలంలో తలంబ్రాలు చూపిస్తున్న అర్చకులు



బీసెంట్‌రోడ్డులో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



బైక్ ర్యాలీలో పాల్గొన్న మహిళలు

విజయవాడ నగర వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా రాములోరి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. పలు ఆలయాలు, మండపాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. దీంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ